www.samasamajam.in

# సమ సమాజం

ప్రశ్నించే అక్షరం... ప్రజలకోసం...

తెలుగు దిన పత్రిక

తెలంగాణ | శుక్రవారం, 04 నవంబర్ 2022 | ఎడిటర్ : గోనుకొండ వృద్ధిరాజు | సంపుటి - 07, సంచిక-182 | పేజీలు - 4 వెల రూ. 5/-

Published From Hyderabad Circulated by Hyderabad, Rangareddy, Nalgonda, Karimnagar, Warangal, Mahaboobnagar, Kammam, Medak

# దేశంలో ప్రజాస్వామ్యం హత్య

## రాష్ట్ర ప్రభుత్వాలను కూల్చే కుట్రలు




- ఎమ్మెల్యేలను కొనే దొంగల ముఠా బయల్దేరింది
- దీని వెనక బిజెపి పెద్ద తలకాయలే ఉన్నాయి
- వారెవరో బయటపడేలా విచారణ చేయాలి
- సుప్రీంకోర్టు, హైకోర్టు ప్రధాన న్యాయమూర్తులు తేల్చాలి
- దేశ ప్రజాస్వామ్య పరిరక్షణకు అందరూ కదలి రావాలి
- ఆధారాలను అన్ని సంస్థలకు పంపుతున్నామన్న కెసిఆర్
- బిజెపి నేతల దుర్మార్గపు ప్రచారం
- పాల్వాయి స్రవంతి తనను కలిసినట్లు ప్రచారమా
- మండిపడ్డ సిఎం కెసిఆర్
- ప్రగతిభవన్‌లో మీడియా సమావేశంలో వివరాలు వెల్లడి

**హైదరాబాద్, నవంబర్ 3 (సమ సమాజం):** దేశంలో ప్రాజస్వామ్య హత్య జరుగుతోందని, రాష్ట్రప్రభుత్వాలను కూల్చే కుట్రలు సాగుతున్నాయని టిఆర్ఎస్ అధికనే, సిఎం కెసిఆర్ అన్నారు. ఇందుకోసం ఓ ముఠా దేశంమీద పడిందన్నారు. ఇప్పటికే 8 రాష్ట్రాల ప్రభుత్వాలను కూల్చామని, తదుపరి తెలంగాణ, ఢిల్లీ, ఎపి,రాజస్థాన్ ప్రభుత్వాలను కూలచబోతున్నామని ప్రకటించారని చెప్పారు. దేశ ప్రజాస్వామ్యపరిరక్షణకు దేశంలోని సుప్రీం ప్రధాన న్యాయమూర్తి సహా, అన్ని రాష్ట్రాల హైకోర్టుల ప్రధాన న్యాయమూర్తులను కోరుతున్నాని చెప్పారు. దేశంలోని అన్ని రాజకీయ పార్టీలుఎ, మీడియా సంస్థలు, సిబిఐ, విజిలెన్స్ సంస్థలకు ఈ ఆధారాలను పంపుతున్నామని అన్నారు. ఈ కుట్ర వెనక ఉన్నదెవరో..వారికి వచ్చిన డబ్బులు ఎక్కడివో తేలాల్సి ఉందన్నారు. గురువారం సాయంత్రం మునుగోడు ఉప ఎన్నిక ముగిసిన తరవాత ప్రగతి భవన్‌లో మంత్రులు, ఎంపిలు, ఎమ్మెల్యేలతో కలసి మీడియా సమావేశంలో మాట్లాడారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా మునుగోడు ఉప ఎన్నికలో పోలింగ్ శాతం భారీగా పెరిగింది.
ఉత్కంఠ భరితంగా సాగిన మునుగోడు ఉప ఎన్నికలో ఎగ్జిట్ పోల్స్ అన్ని టీఆర్ఎస్

2వ

## దేశంలో ఏడు అసెంబ్లీ స్థానాలకు ఉప ఎన్నిక

ప్రశాంతంగా మొదలైన పోలింగ్




**న్యూఢిల్లీ, నవంబర్ 3 (సమ సమాజం):**దేశవ్యాప్తంగా ఆరు రాష్ట్రాల్లోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల ఉప ఎన్నికలకు గురువారం ఉదయం పోలింగ్ ప్రారంభమైంది. ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు పోలింగ్ కొనసాగనున్నది. బీహార్‌లోని మొకామా, గోపాల్‌గంజ్, మహారాష్ట్రలోని అంధేరి (తూర్పు), హర్యానాలోని అదమ్‌పూర్, తెలంగాణలోని మునుగోడు, యూపీలోని గోల గోకర్‌నాథ్, ఒడిశాలోని ధామ్‌నగర్‌లోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలకు ఇవాళ ఎన్నికలు జరుగుతున్నాయి. ఆయా నియోజకవర్గ స్థానాల్లో సిట్టింగ్ ఎమ్మెల్యేలు మరణించడం, మరికొన్నింటిలో ఎమ్మెల్యేల పార్టీ ఫిరాయింపుల కారణంగా ఉప ఎన్నికలు అనివార్యమయ్యాయి. గత నెలలో ఉప ఎన్నికల షెడ్యూల్ విడుదలవగా.. గురువారం ఉప ఎన్నికలు జరుగుతుండగా.. 6న ఓట్లను లెక్కించనున్నట్లు ఎన్నికల అధికారులు తెలిపారు.

## సిఎం కెసిఆర్‌తో స్రవంతి భేటీ

బిజెపి పుకార్లను ప్రచారం చేస్తోందన్న రేవంత్

**హైదరాబాద్, నవంబర్ 3 (సమ సమాజం):** మునుగోడు కాంగ్రెస్ అభ్యర్థి పాల్వాయి స్రవంతి ముఖ్యమంత్రి కేసీఆర్ తో భేటీ అయ్యారని సోషల్ మీడియాలో వస్తున్న వార్తలపై పీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డి ట్విట్టర్ వేదికగా స్పందించారు. పాల్వాయి స్రవంతి ఫొటోను మార్ఫింగ్ చేసి కేసీఆర్ తో భేటీ అయ్యారంటూ బీజేపీ దుష్ప్రచారం చేస్తోందని, ఓటమి భయంతో ఇలా దిగజారారని మండిపడ్డారు. దుబ్బాక

2వ



## మునుగోడు పోలింగ్ సందర్భంలో చిత్రం

### కెఎ పాల్ పరుగులు..జనం నవ్వులు





**నల్లగొండ,నవంబర్ 3 (సమ సమాజం):** కెఎపాల్ గురించి ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. ఈ మధ్య సోషల్ మీడియాలో కామెడి వస్తువుగా తయారయ్యాడు. జనం పాల్ చేష్టలను చూసి ఎంజాయ్ చేస్తున్నారు. మీడీయాను అట్రాక్ట్ చేయడానికి పాల్ ఏదో ఒక చిలిపి పని చేస్తుంటాడు. ఆయన మాట్లాడితే ఫుల్ కామెడీ. గురువారం మునుగోడు ఉప ఎన్నిక పోలింగ్ జరుగుతోంది. పాల్ తన కారులో ప్రతి పోలింగ్ బూత్‌ను విజిట్ చేస్తున్నారు. అయితే అందిరిలా ఉంటే ఆయన పాల్ కాడు కదా? అందుకే పోలింగ్ బూత్‌ల వద్ద పరుగులు పెడుతున్నారు. ఎవరో తరుముతున్నట్లు ఒకటే పరుగు. అది చూసి ఓటేయడానికి వచ్చిన జనం ఒకటే నవ్వులు. ఎందుకలా పరుగెడుతున్నారని మీడియా అడిగితే? టైం లేదు.. అన్ని పోలింగ్ బూతులను కవర్ చేయాలి కదా. అందుకే సాయంత్రం వరకు ఇలా పరుగెడుతూనే ఉంటానని అన్నాడు. పాల్ పరుగులు తీస్తున్న వీడియోలు మీడియాలో వైరల్ అయ్యాయి.

# మునుగోడులో ముగిసిన పోలింగ్

## సాయంత్రం 6 తరవాత కూడా భారీగా క్యూ లైన్లు

సాయంత్రం 5గంటల వరకు 77.55శాతం ఓటింగ్ నమోదు

క్యూలో ఉన్న వారందరికి ఓటేసే అవకాశం ఇస్తామన్న ఇసి



**నల్లగొండ,నవంబర్ 3 (సమ సమాజం):** మునుగోడు ఉపఎన్నిక పోలింగ్ ముగిసింది. సాయంత్రం 6గంటల వరకు క్యూలో ఉన్న వారందరికీ ఓటేసేందుకు అవకాశం ఇచ్చారు. చాలా పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లు బారులు తీరారు. దీంతో మరో రెండు గంటలపాటు పోలింగ్ కొనసాగే అవకాశం ఉంది. సాయంత్రం 5గంటల వరకు 77.55శాతం ఓటింగ్ నమోదు అయింది. మొత్తం 2లక్షల 41వేల 805 ఓట్లకు.. ఐదు గంటల వరకు లక్షా 87వేల 527మంది ఓట్లు వేశారు. ఉదయం పోలింగ్ కాస్త మందగించినా..మధ్యాహ్నం నుంచి క్రమంగా పెరుగుతూ వచ్చింది. మధ్యాహ్నం ఒంటిగంట నుంచి 5గంటల లోపు దాదాపు 40శాతం పోలింగ్ నమోదు అయింది. మధ్యాహ్నం తర్వాత మహిళలు, యువత పోలింగ్ కేంద్రాలకు క్యూ కట్టారు. కొన్నిచోట్ల ఈవీఎంలు మొరాయించడంతో.. పోలింగ్

2వ

## మునుగోడు వెళుతున్న బండి సంజయ్ అరెస్ట్

**హైదరాబాద్, నవంబర్ 3 (సమ సమాజం):** మునుగోడు అసెంబ్లీ నియోజకవర్గ ఉపఎన్నికలో పోలింగ్ ప్రారంభం కావడానికి కొన్ని గంటల ముందు బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. గురువారం తెల్లవారుజామున 2 గంటలకు బండి సంజయ్ ను అదుపులోకి తీసుకున్నారు.మునుగోడుకు వెళుతున్న బండి సంజయ్ కాన్వాయ్‌ని అడ్డుకొని అతన్ని అబ్దుల్లాపూర్ మెట్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు.తెలంగాణ

2వ



## మోగిన గుజరాత్ అసెంబ్లీ ఎన్నికల నగారా




- డిసెబర్‌లో రెండు విడుతల్లో ఎన్నికలు
- డిసెంబర్1, 5న రెండు ఎన్నికలకు నిర్ణయం
- డిసెంబర్ 8న ఫలితాల వెల్లడి
- చీఫ్ ఎలక్షన్ కమిషనర్ రాజీవ్ కుమార్ వెల్లడి

**న్యూఢిల్లీ, నవంబర్ 3 (సమ సమాజం):** గుజరాత్ అసెంబ్లీ ఎన్నికల నగారా మోగింది. ఆ రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల తేదీలను కేంద్రం ఎన్నికల సంఘం గురువారం ప్రకటించింది. రెండు దశల్లో గుజరాత్ అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. డిసెంబర్ ఒకటో తేదీన తొలి దఫా, అయిదవ తేదీన రెండోదఫా ఎన్నికలను నిర్వహించ నున్నారు. డిసెంబర్ 8వ తేదీన ఫలితాలను వెల్లడించనున్నట్లు చీఫ్ ఎలక్షన్ కమిషనర్ రాజీవ్ కుమార్ తెలిపారు. తొలి విడుతలో 89 స్థానాలకు, రెండవ విడుతలో 93 స్థానాలకు పోలింగ్ జరగనున్నట్లు ఆయన

2వ

## సీనియర్ పాత్రికేయులు వరదాచారి మృతి

- చికిత్స పొందుతూ మరణించినట్లు ప్రకటన
- జిఎస్ మృతికి సిఎం కెసిఆర్ సంతాపం

**హైదరాబాద్,నవంబర్ 3 (సమ సమాజం):** ప్రముఖ పాత్రికేయులు జిఎస్ వరదాచారి కన్నుమూశారు. ఉదయం కెఎల్ రెడ్డి కన్ను మూశారన్న విషయం పై జర్నలిస్టులు చర్చించుకుంటున్న తరునంలో మరో వార్త తెలిసింది.

2వ



## హైదరాబాద్‌లో మళ్లీ డబుల్ డెక్కర్ల చప్పుడు

ఎలక్ట్రిక్ బస్సలు ప్రవేశానికి రంగం సిద్ధం




**హైదరాబాద్, నవంబర్ 3 (సమ సమాజం):** హైదరాబాద్ నగరవాసులకు ఆర్టీసీ శుభవార్త అందించింది. తెలంగాణ రాజధాని నగరమైన హైదరాబాద్ నగర రోడ్లపై త్వరలో ఎలక్ట్రిక్ డబుల్ డెక్కర్ బస్సులు రానున్నాయి. హైదరాబాద్ నగరంలో డబుల్ డెక్కర్ బస్సులకు దీర్ఘకాలంగా డిమాండ్ ఉంది. నెటిజన్లు గత కొంతకాలంగా డబుల్ డెక్కర్ బస్సులను హైదరాబాద్ నగరంలో ప్రవేశపెట్టాలని మున్సిపల్ శాఖ మంత్రి

2వ

## మునుగోడులో టిఆర్ఎస్‌దే విజయం

- అంచనా వేసిన పలు సంస్థల ఎగ్జిట్‌పోల్స్
- బిజెపికి రెండో స్థానం మాత్రమే వస్తుందని వెల్లడి

**హైదరాబాద్,నవంబర్ 3 (సమ సమాజం):** ఉత్కంఠభరితంగా సాగిన మునుగోడు ఉప ఎన్నిక లో విజేతగా ఎవరు నిలవబోతున్నారో ఎన్నికల సర్వే సంస్థలు అంచనా వేశాయి. దాదాపు అన్ని సర్వే సంస్థలూ టీఆర్ఎస్ అభ్యర్థి

2వ

## సంపాదకీయం

# విశాఖ ఉక్కుపై మోడీ నోరు విప్పగలరా !

త్వరలో ప్రధాని మోడీ ఎపిలో పర్యటించనున్నారు. ప్రధానంగా విశాఖపట్టణంలో రెండు రోజులపాటు పర్యటించనున్నారు. ఇక్కడ అనేక కార్యక్రమాల్లో పాల్గొంటారు. ఈ క్రమంలో విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ, గంగవరం పోర్టు ఆదానీకి అప్పగింతలపై ప్రకటన చేసే ధైర్యం మాత్రం ప్రదర్శించరు. అయితే సహజం గానే ప్రధాని రాకవల్ల ఆందోళనకారులను ముందే ఇంటికి పరిమితం చేస్తారు. సామాన్యుల గళం వినిపించ కుండా చేస్తారు. అధికారంలో ఉన్న వైసిపి కూడా ఇందుకు ముందే చర్యలు తీసుకుంటుంది. విభజన సమస్యలను ప్రస్తావించే ధైర్యం కూడా జగన్ ప్రభుత్వం చేయదు. ఉన్న సంస్థలను అమ్ముకుంటూ పోతున్న మోడీ ప్రభుత్వం ఇక కొత్త సంస్థలను పెడుతుందని అనుకుంటే భ్రమే కాగలదు. విశాఖ స్టీల్ ప్లాంట్ లేదా, గంగవరం పోర్టు లాంటివి బిజెపి తెస్తేనో..లేదా ఇస్తేనో రాలేదు. అందుకే వాటి చెమట కథలు మోడీకి లేదా బిజెపి నేతలకు తెలియదు. జగన్ ప్రభుత్వంలోని పెద్దలకు కూడా తెలియదు. వారు ఎంతసేపు అమరావతికి వ్యతిరేకంగా ఉద్యమిస్తున్నారే తప్ప విశాఖ ఉక్కును కాపాడుకునేందుకు కేంద్రంతో పోరాటం చేయడం లేదు. ఆదానీ అంబానీలకు గులాంగిరీ చేసేందుకు పోటీ పడుతున్నారు. రాష్ట్రాల్లో నిలదీసే ప్రభుత్వాలు లేకపోవడంతోనే ప్రభుత్వరంగ సంస్థలను ప్రయివేటీకరించటంలో మోడీ సర్కారు ప్రత్యేక శ్రద్ధతో పని చేస్తున్నది. మోడీ పాలన కొనసాగితే దేశంలోని ప్రభుత్వరంగ సంస్థలు పూర్తిగా మాయం అవుతాయి. ప్రైవేట్ రంగం అప్పనంగా ఉన్న సంస్థలను కొట్టేస్తాయి. కొత్త సంస్థలు రావు. నిరుద్యోగం పెరుగుతూ పోతుంది. ద్రవ్యోల్బణం మరింత పెరగగలదు. అలాగే జిఎస్టీ వసూళ్లపై ఉన్న మక్కువతో ఇక్క మరిన్ని వస్తువులను ఇందులో చేర్చి ప్రజలను పీల్చి పిప్పి చేయగలరు. ఈ ప్రమాదాలను గుర్తించకుండా మోడీ నిర్ణయాలను ప్రశ్నించకుండా ఉంటే ప్రమాదం తప్పదని ప్రజలు,రాజకీయ పార్టీలు గుర్తించాలి. మోడీ నిర్ణయాలు దేశానికి మంచిచేస్తుందా లేదా అన్న వివేచన లేకుండా గుడ్డిగా నమ్మడం సరికాదు. మోడీ తీసుకుంటున్న నిర్ణయాలతో దేశం ఆర్థికంగా దివాళా దిశకు చేరుకుంటోంది. నిరుద్యోగం ప్రబలుతోంది. వాటాలు, పెట్టుబడుల ఉపసంహారణతో ప్రయివేటు, కార్పొరేట్లకు లబ్ధి చేకూరుస్తున్నది. అదానీ, అంబానీ వంటి సంపన్నులకు లబ్ధి చేకూరేలా మోడీ సర్కారు నిర్ణయాలను తీసుకుంటోంది. తన కనుసన్నల్లో నడిచే రాష్ట్రాలను కూడా అందుకు ప్రేపిస్తోంది. అందులో ఆంధ్ఆర కూడా ఒకటని చెప్పుకోవడంలో సిగ్గు పడాల్సిన పనిలేదు. అందుకే గతంలో ఎప్పుడూ లేనంతగా మోడీ ద్వయం హయాంలో ఆదానీ,అంబానీలు చాలా లబ్దిపొందుతున్నారు. ముఖ్యంగా 1991 నుంచి పెట్టుబడుల ఉపసంహారణ పక్రియ ప్రారంభమైంది. అప్పటి నుంచి చూసుకుంటే మూడు దశాబ్దాలకు పైగా భారత్‌ను కాంగ్రెస్, బిజెపి నేతృత్వంలోని అనేక ప్రభుత్వాలు పాలించాయి. అప్పటి నుంచి పలు ప్రభుత్వాలు ప్రభుత్వ రంగ సంస్థల్లో వాటాల విక్రయం, పెట్టుబడుల ఉపసంహారణను తమకు అనుకూలంగా అమలు చేస్తున్నాయి. అయితే అప్పటినుంచి ఇప్పటి వరకు పరిశీలిస్తే మాత్రం మోడీ ప్రభుత్వమే అత్యధిక శాతం పెట్టుబడుల ఉపసంహారణను చేసింది. ఇందులో తాజాగా ఎల్ఐసి, విశాఖ స్టీల్ లాంటి ఎన్నో సంస్థలు ఉన్నాయి. రిజర్వ్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా , డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఇన్వెస్ట్‌మెంట్ అండ్ పబ్లిక్ అసెట్స్ మేనేజ్‌మెంట్ సమాచార విశ్లేషణలోనూ ఈ విషయం వెల్లడైంది. 1991 నుంచి ప్రభుత్వాలు చేసిన పెట్టుబడుల ఉపసంహారణలో మోడీ సర్కారు వాటా 72 శాతం అంటే రూ. 4.48 లక్షల కోట్లుగా ఉన్నది. 2014 తర్వాత మొత్తం పెట్టుబడుల ఉపసంహారణ ఆదాయంలో ఇప్పటికీ ముఖ్యమైన 57 శాతం జమ అయినట్టు డేటా చూపిస్తుంది. ప్రభుత్వరంగ సంస్థల్లో పెట్టుబడుల ఉపసంహారణ గురించి 1991-92 మధ్యంత రబడ్జెట్‌లో అప్పటి ఆర్థిక మంత్రి యశ్వంత్ సిన్హా పేర్కొన్నారు. ఆ తర్వాత అనేక సంకీర్ణ ప్రభుత్వాలు వచ్చాయి. వాజ్‌పేయి ప్రభుత్వ హయాంలోనూ పెట్టుబడుల ఉపసంహారణ తిరిగి ఊపందుకున్నది. కాంగ్రెస్ నేతృత్వంలోని యూపీఏ హయాంలోనూ ఈ రకమైన చర్యలు సాగాయి. కేంద్రంలో ఎవరు అధికారంలో ఉన్నా ప్రభుత్వ సంస్థల నుంచి పెట్టుబడులు ఉపసంహా రించడటం గమనించాల్సిన అంశం. ఈ విషయంలో రాహుల్‌ను లేదా కాంగ్రెస్‌ను కూడా నమ్మడానికి లేదు. 2014లో కేంద్రంలో మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పరిస్థితులు మరింతగా దిగజారరాయి. 2014-19 మధ్య పెట్టుబడుల ఉపంసహరణ, వాటాల విక్రయం ద్వారా మోడీ ప్రభుత్వం రూ. 3.2 లక్షల కోట్లను సంపాదించింది. రెండోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత బీజేపీ నేతృత్వంలోని ఎన్డీయే ప్రభుత్వం అదే తీరును కొనసాగించింది. పేదలకు ఆహారం కోసం ఆలోచించటం, వారికోసం ఇండ్లు, టాయ్‌లెట్లు నిర్మించటం, శుద్ధమైన నీరు, ఆరోగ్యమైన వసతులు అందించటం, రోడ్లు నిర్మించటం,చిన్న రైతుల కోసం ఆలోచించటం ప్రభుత్వ పనని అంటూ దీనికి మోడీ కలరింగ్ ఇచ్చారు. దీనికోసమే పెట్టుబడుల ఉపసంహా రణను సమర్థించినట్లు బడ్జెట్ ప్రసంగంలో చెప్పుకున్న ఘనత మోడీది. అయితే మోడీ ప్రధాన లక్ష్యం మాత్రం దేశ సంపదను కార్పొరేట్లకు దోచిపెట్టి ప్రభుత్వ రంగ సంస్థలను నిర్వీర్యం చేయటమేనని కొందరు ఆర్థిక నిపుణులు చేస్తున్న ఆరోపణలను కాదనలేం. వ్యవసాయ రంగంలో అధిక ఉత్పత్తి సాధించడంలో ఎక్కడా శ్రద్ద కానరావడం లేదు. ఆహార వస్తువుల ధరల స్థిరీకరణకు పాటుపడడం లేదు. పేద ప్రజలకు ఆహార భద్రత కలిగించడంలో పూర్తిగా విఫలం అయ్యారు. వ్యవసాయదారులు, వినియోగదారుల ప్రయోజనాల మధ్య సమతూకం సాధించడం లేదు. దేశంలో ద్రవ్యోల్బణ పరిస్థితులను నివారించడంలో పాలకులు పూర్తిగా వైఫల్యం చెందారు. పరిమితంగా ఉన్న వనరులను సమర్థవంతంగా ఉపయోగించడం కూడా చేయడం లేదు. ఈ విధానాలను కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఏవీ పాటించడం లేదు. 75 ఏళ్ల స్వాతంత్ర్యానంతరం కూడా పేదరికం ఊబిలో కూరుకుపోతున్నా, ధరలు నానాటికీ పెరగడానికి కారణం వ్యవసాయ అభివృద్ధి, పరిశ్రమల అభివృద్ధి కుంటుపడటమే అని పాలకులు గుర్తించడం లేదు. ప్రజలను ఉత్పత్తిలో భాగస్వాములుగా చేయడం పక్కన పెట్టి వారికి తాయిలాలు ఇస్తూ ఓట్లు వేసుకునే యంత్రాలుగా మార్చినంత కాలం దేశం పురోగమించదని గుర్తించాలి.

పృధ్విరాజ్ గోసుకొండ
ఎడిటర్

# మునుగోడులో ముగిసిన పోలింగ్



(మొదటి పేజీ తరువాయి) లేట్ అయింది. అయినా ఓటర్లు గంటల తరబడి పోలింగ్ కేంద్రాల్లో వెయిట్ చేసి ఓటు హక్కును వినియోగించుకున్నారు. చివరి రెండు గంటల్లో ఓటర్లు భారీగా పోలింగ్ కేంద్రాలకు చేరుకున్నారు. మధ్యాహ్నం తర్వాత మహిళలు, యువత పోలింగ్ కేంద్రాలకు క్యూ కట్టారు. కొన్నిచోట్ల ఈవీఎంలు మొరాయించడంతో.. పోలింగ్ లేట్ అయింది. అయినా ఓటర్లు గంటల తరబడి పోలింగ్ కేంద్రాల్లో వెయిట్ చేసి ఓటు హక్కును వినియోగించుకున్నారు. చివరి రెండు గంటల్లో ఓటర్లు భారీగా పోలింగ్ కేంద్రాలకు చేరుకున్నారు. మునుగోడులో పోలింగ్ సమయం ముగిసినా నాంపల్లి మండలం వడ్డేపల్లి గ్రామంలో ఇవిఎంలు మొరాయిస్తున్నాయి. ఓటర్లు ఓటు వేసేందుకు ఉదయం నుంచి పోలింగ్ కేంద్రం దగ్గర పడిగాపులు కాస్తున్నారు. సాయంత్రం 6 గంటలు దాటినా ఈవీఎంలు పనిచేయకపోవడంతో దాదాపు 250 మంది ఓటర్లు టెంట్ల కింద కూర్చుని ఓటు వేసేందుకు నిరీక్షించారు. ఉదయం నుంచి వేచి చూసినా ఓటు వేయకపోవడంతో ఓటర్లు ఆగ్రహం వ్యక్తం చేసారు. దీంతో పోలింగ్ కేంద్రం వద్ద ఓటర్లు బారులు తీరారు. 250 మందికి టోకెన్లు అందజేసిన అధికారులు..ఇప్పటి వరకు ఎలాంటి సమాధానం చెప్పడం లేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అసలు ఈవీఎంలు పనిచేస్తాయో లేదో కూడా సరైన సమాధానం చెప్పడం లేదని వాపోతున్నారు. చౌటుప్పల్, నారాయణపురంలో భారీగా పోలింగ్ నమోదైంది. అయితే పోలింగ్ సమయం ముగిసే సమయానికి క్యూలైన్లలో నిల్చున్న వారందరికీ ఓటేసేందుకు అధికారులు అవకాశం కల్పించనున్నారు. పలు చోట్ల మరో గంట పాటు పోలింగ్ కొనసాగే అవకాశం ఉంది. ఓటేసేందుకు మహిళలు, వృద్ధులు, యువత బాగా ఆసక్తి చూపారు. మొత్తంగా మునుగోడులో భారీగా పోలింగ్ నమోదు అయ్యే అవకాశం ఉంది. టీఆర్ఎస్ నుంచి కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి, బీజేపీ తరపున రాజగోపాల్ రెడ్డి, కాంగ్రెస్ నుంచి పాల్వాయి స్రవంతి రెడ్డి బరిలో ఉన్నారు. ఈ ముగ్గురి మధ్యనే ప్రధాన పోటీ నెలకొంది. వీరి భవితవ్యాన్ని ఓటర్లు ఈవీఎంలలో నిక్షిప్తం చేశారు. ఎన్నికల ఫలితాలు నవంబర్ 6వ తేదీన వెలువడనున్నాయి. పోలింగ్ కేంద్రాల వద్ద పరిస్థితిని ఈసీ క్లోజ్‌గా మానీటరింగ్ చేసింది. మొత్తం 298 సెంటర్లలోనూ వెబ్ క్యాస్టింగ్ ఏర్పాటు చేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా అధికారులు గట్టిచర్యలు తీసుకున్నారు. మొదట ఉద్రిక్తతలు తలెత్తినా మధ్యాహ్నం నుంచి ఓటింగ్ ప్రశాంతంగానే కొనసాగింది. ఈ క్రమంలో గట్టుప్పల్ మండలం అంతంపేటలో ఓటర్లు ఓటింగ్ బహిష్కరించారు. టీఆర్ఎస్, బీజేపీ నేతలు డబ్బులు పంచుతామని చెప్పి డబ్బులు ఇవ్వలేదని ఆగ్రహం వ్యక్తంచేశారు. డబ్బులు తెచ్చుకొని నేతలు ఇంట్లో దాచుకున్నారు. తులం బంగారం, డబ్బులు ఇస్తామని చెప్పి ఇవ్వలేదంటూ ఓటర్లు ఆరోపించారు. పక్క గ్రామాల్లో డబ్బులు పంచారు. మేము ఏమి అన్యాయం చేశామంటూ.. దూర ప్రాంతాల నుంచి వచ్చామని.. కానీ ఇవ్వలేదంటూ పేర్కొన్నారు. డబ్బులు పంచితేనే ఓట్లు వేస్తామని ఓటర్లు ఖరాఖండిగా పేర్కొన్నారు..

## మోగిన గుజరాత్ అసెంబ్లీ ఎన్నికల నగారా

(మొదటి పేజీ తరువాయి) వెల్లడించారు. గుజరాత్ అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి ఇవాళ సీఈసీ రాజీవ్ కుమార్ మీడియాతో మాట్లాడారు. గుజరాత్‌లో మొత్తం 182 అసెంబ్లీ స్థానాలు ఉన్నాయన్నారు. జనరల్ 142, ఎస్టీ 13, ఎస్సీ 27 స్థానాలు ఉన్నట్లు సీఈసీ వెల్లడించారు. 51,782 పోలింగ్ స్టేషన్లను ఏర్పాటు చేశామన్నారు. అర్బన్ ప్రాంతాల్లో 17506, రూరల్ ఏరియాలో 34276 పోలింగ్ బూత్‌లను ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. 182 మోడల్ పోలింగ్ స్టేషన్లను ఏర్పాటు చేశారు. రాష్ట్రంలో మొత్తం ఓటర్ల సంఖ్య 4,90,89765. దీంట్లో తొలిసారి 4,61,494 మంది ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. 2017లో జరిగిన ఎన్నికల్లో బీజేపీ 111 స్థానాలు గెలుచుకున్నది. ఈ సారి కాంగ్రెస్, ఆప్, బీజేపీ మధ్య రసవత్తర పోరు తప్పదు. గుజరాత్ అసెంబ్లీ ఫిబ్రవరి 18, 2023లో ముగియనున్నది. హిమాచల్ ప్రదేశ్, గుజరాత్ ఎన్నికలకు ప్రత్యేక అబ్జర్వర్‌ను ఏర్పాటు చేసినట్లు సీఈసీ రాజీవ్ కుమార్ వెల్లడించారు. మహిళలు, వృద్ధులపై ప్రత్యేక శ్రద్ధ పెట్టనున్నారు. 4.90 కోట్ల మంది ఓటర్లలో పురుషులు 2.53 కోట్లు, మహిళలు 2.37 కోట్లు, మూడవ జెండర్‌కు చెందిన 1,417 మంది ఓటర్లు ఉన్నారు. గుజరాత్ అసెంబ్లీ ఎన్నికలకు షెడ్యూల్ విడుదల కాగా నోటిఫికేషన్ ఈ నెల 5వతేదీన రిలీజ్ చేయనున్నట్లు సీఈసీ రాజీవ్ కుమార్ తెలిపారు. 2017లో జరిగిన ఎన్నికల్లో బీజేపీ 111 స్థానాలు గెలుచుకున్నది. ఈ సారి కాంగ్రెస్, ఆప్, బీజేపీ మధ్య రసవత్తర పోరు తప్పదు. గుజరాత్ అసెంబ్లీ ఫిబ్రవరి 18, 2023లో ముగియనున్నది.హిమాచల్ ప్రదేశ్, గుజరాత్ ఎన్నికలకు ప్రత్యేక అబ్జర్వర్‌ను ఏర్పాటు చేసినట్లు సీఈసీ రాజీవ్ కుమార్ వెల్లడించారు. మహిళలు, వృద్ధులపై ప్రత్యేక శ్రద్ధ పెట్టనున్నారు. 4.90 కోట్ల మంది ఓటర్లలో పురుషులు 2.53 కోట్లు, మహిళలు 2.37 కోట్లు, మూడవ జెండర్‌కు చెందిన 1,417 మంది ఓటర్లు ఉన్నారు.

## సీనియర్ పాత్రికేయులు వరదాచారి మృతి

(మొదటి పేజీ తరువాయి) గోవర్ధన సుందర వరదాచారి(92) కిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ గురువారం మధ్యాహ్నం మృతి చెందారు. లబ్దప్రతిష్టులైన జీఎస్ వరదాచారి జర్నలిజంలో ఎన్నో ఉన్నతశిఖరాలకు ఎదిగారు. నిజామాబాద్ జిల్లాకు చెందిన వరదాచారి నాలుగు దశాబ్దాల పాటు జర్నలిజం రంగం వృద్ధికి కృషి చేశారు. వరదాచారికి ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. వరదాచారి1956 ఒక తెలుగు దిన పత్రికలో సబ్‌ఎడిటర్‌గా చేరి తన పాత్రికేయ వృత్తిని ప్రారంభించారు. 1961లో ఆంధ్ర భూమి దిన పత్రికలో న్యూస్ ఎడిటర్‌గా బాధ్యతలు చేపట్టి 22 సంవత్సరాలు పనిచేశారు. ప్రముఖ దిన పత్రిక ఈనాడులో అసిస్టెంట్ ఎడిటర్‌గా 1983లో బాధ్యతలు చేపట్టారు. తెలుగు విశ్వావిద్యాలయంతో పాటు అనేక యూనివర్సిటీలలో ఆయన జర్నలిజం బోధించారు. అన్ని ప్రముఖ దిన పత్రికల జర్నలిజం కళాశాలలో అయన బోధించేవారు. ఉమ్మడి రాష్ట్రంలో ప్రెస్ అకాడమీ శిక్షణ తరగతులలో పత్రికల భాష అంశంపై ఆయన బోధించే వారు. సీనియర్ పాత్రికేయులు జీఎస్ వరదాచారి మరణం పట్ల ముఖ్యమంత్రి కేసీఆర్ సంతాపం వ్యక్తం చేశారు. నిజామాబాద్‌జిల్లాకు చెందిన వరదాచారి నాలుగు దశాబ్దాల పాటు జర్నలిజం రంగానికి సేవలందించారని సీఎం పేర్కొన్నారు. ఆయన కుటుంబ సభ్యులకు సీఎం కేసీఆర్ తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

## సిఎం కెసిఆర్‌తో స్రవంతి భేటీ

(మొదటి పేజీ తరువాయి) ఉప ఎన్నిక తరహాలోనే మునుగోడులోనూ దుష్ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. సీఎం కేసీఆర్ ను కలిశానని తనపై వస్తున్న వార్తలపై పాల్వాయి స్రవంతి ఈసీకి ఫిర్యాదు చేశారు. ఓటర్లను ప్రభావితం చేసేలా ఫేక్ న్యూస్ క్రియేట్ చేశారని పేర్కొన్నారు. సోషల్ మీడియాలలో తప్పుడు వార్తలు ప్రచారం చేస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని పాల్వాయి స్రవంతి ఈసీ అధికారులను కోరారు.

## మునుగోడులో టిఆర్ఎస్‌దే విజయం



(మొదటి పేజీ తరువాయి) కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి గెలుస్తారని ఎగ్జిట్ పోల్స్‌లో ప్రకటించాయి. రెండో స్థానంలో కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి, మూడో స్థానంలో కాంగ్రెస్ అభ్యర్థి పాల్వాయి స్రవంతి నిలుస్తారని సర్వే సంస్థలు ప్రకటించాయి. మునుగోడు ఉప ఎన్నిక.. ఇప్పుడు తెలుగు రాష్ట్రాల్లోనే కాదు.. దేశ వ్యాప్తంగా కూడా దృష్టిని ఆకర్షించింది. ప్రధాన పోటీ రెండు పార్టీల మధ్యే నెలకొంది. టీఆర్ఎస్, బీజేపీ అభ్యర్థుల మధ్యే హోరాహోరీ పోరు ఉంది. అయితే మునుగోడు ఉప ఎన్నిక పోలింగ్ సమయం ముగియడంతో ఆయా సంస్థలు ఎగ్జిట్ పోల్స్ ను వెల్లడించాయి. అన్ని ఎగ్జిట్ పోల్స్‌లో టీఆర్ఎస్ పార్టీనే గెలువబోతున్నట్లు వెల్లడైంది. బీజేపీ రెండో స్థానం, కాంగ్రెస్ మూడో స్థానానికి పరిమితం అయ్యే అవకాశం ఉందని అంచనా వేశాయి. జనం సాక్షి రిపోర్టు.. ప్రకారం టీఆర్ఎస్ అభ్యర్థి కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి 15 వేల నుంచి 20 వేల మెజార్టీతో గెలుపొందే అవకాశం ఉందని తెలిపింది. రాజగోపాల్ రెడ్డి రెండో స్థానంతో సరిపెట్టుకునే అవకాశం ఉందని, పాల్వాయి స్రవంతి మూడోస్థానంలో నిలిచే అవకాశం ఉన్నట్లు పేర్కొంది. ఆత్మసాక్షి సర్వే రిపోర్ట్.. టీఆర్ఎస్‌కు 41నుంచి 42 శాతం ఓట్ షేర్ వచ్చే అవకాశముందని తెలుస్తోంది. బీజేపీకి 35 నుంచి 36 శాతం ఓట్ షేర్, కాంగ్రెస్‌కు 16.5 నుంచి 17.5 శాతం ఓట్ షేర్ రానున్నట్లు ఎగ్జిట్ పోల్స్ చెబుతున్నాయి. ఇక బీఎస్పీకి 4 నుంచి 5 శాతం ఓట్ షేర్ రావొచ్చని అంచనా వేస్తున్నారు. ఇతరులకు 1.5 నుంచి 2 శాతం ఓట్ షేర్ వచ్చే అవకాశం కనబడుతోంది. టీఆర్ఎస్ అభ్యర్థికి 85 వేల ఓట్ల మెజార్టీ వచ్చే అవకాశం ఉన్నట్లు పేర్కొంది. మిర్రర్ ఆఫ్ పబ్లిక్ పల్స్ రిపోర్టు ప్రకారం.. టీఆర్ఎస్ పార్టీకి 42.13 శాతం ఓట్లు, బీజేపీకి 31.98 శాతం, కాంగ్రెస్‌కు 21.06 శాతం ఓట్లు పోలయ్యే అవకాశం ఉన్నట్లు పేర్కొంది. పల్స్ టుడే పోల్ ప్రకారం.. 42 నుంచి 43 శాతం ఓట్లు, బీజేపీకి 38.05 శాతం ఓట్లు, కాంగ్రెస్ పార్టీకి 14 నుంచి 16 శాతం ఓట్లు పోలయ్యే అవకాశం ఉందని పేర్కొంది.

# దేశంలో ప్రజాస్వామ్యం హత్య

(మొదటి పేజీ తరువాయి) వచ్చాయి. మునుగోడు ఉప ఎన్నిక ముగిసిన అనంతరం సీఎం కేసీఆర్ మీడియా సమావేశం నిర్వహించారు. చాలా బాధాకరం, దుఃఖంతో తొలిసారి ప్రెస్‌మీట్ నిర్వహిస్తున్నానని తెలిపారు. దేశంలో ప్రజాస్వామ్య హత్య జరుగుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్య హంతకులు స్వైరవిహారం చేస్తున్నారని, ఊహకు కూడా అందని విధంగా వ్యవహరించారని దుయ్యబట్టారు. దేశాన్ని బీజేపీ సర్కార్ అన్ని రంగాల్లో నాశనం చేసిందని మండిపడ్డారు. నిరుద్యోగం, రూపాయి పతనం, పేదరికం వంటివి జరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. మునుగోడులో బీజేపీవి వెకిలిచేష్టలని కొట్టిపారేశారు. ఎన్నికల్లో ఎవరి ప్రయత్నం వాళు చేసినా.. ప్రజాతీర్పును అందరూ గౌరవించాలన్నారు. ప్రతిపక్షాలు చెబితే సరే అనాలి.. లేదంటే ఎలక్షన్ కమిషన్ విఫలమా? అని ప్రశ్నించారు. ఎన్నో ఉద్యమాలు, పోరాటాలు చేశామని గుర్తుచేశారు. బీజేపీలా దుర్మార్గంగా, దిగజారి ఎప్పుడూ వ్యవహరించలేదని కేసీఆర్ తెలిపారు. న్యాయవ్యవస్థ, ఈసీ, మీడియా అంటే బీజేపీకి గౌరవం లేదు. ప్రజల కోసం పోరాడేవాళ్లు జైల్లో ఉన్నా గెలిచారు. బెంగాల్‌లో టీఎంసీ ఎమ్మెల్యేలు బీజేపీతో టచ్‌లో ఉన్నారని.. సాక్షాత్తు ప్రధానినే చెప్పడం గతంలో ఎప్పుడైనా ఉందా?... ప్రధాని మోదీ తీరును ఖండించకపోతే అందరం పోతాం. ఎవరికి వారు నాకెందుకులే అనుకుంటే అందరం నష్టపోతాం. దేశం ఒక్కసారి దెబ్బతింటే వందేళ్లు వెనక్కి పోతాం. తెలంగాణలో ఏక్‌నాథ్ షిండేలు ఉన్నారంటున్నారు. ఏం చూసుకుని బీజేపీ నేతలు మాట్లాడుతున్నారు. 8 రాష్ట్రాల్లో ప్రభుత్వాలను బీజేపీ కూల్చింది. తెలంగాణ, ఢిల్లీ, ఏపీ ప్రభుత్వాలను కూల్చేందుకు బీజేపీ కుట్ర చేస్తోంది. బీజేపీ కొనుగోలు బాగోతం 3 గంటల వీడియో మా దగ్గర ఉంది. ప్రజల సౌకర్యం కోసం 60 నిమిషాలకు కుదించాం. తుషార్ అనే కీలక వ్యక్తితో బీజేపీకి సంబంధం ఉందని కేసీఆర్ ఆరోపించారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం, నాయకులపై ముఖ్యమంత్రి కేసీఆర్ తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. ఈ ప్రజాస్వామ్య హంతకుల స్వైర విహారం చాలాచాలా ఈ దేశం పునాదులకే ప్రమాదకరం అని కేసీఆర్ పేర్కొన్నారు. ఈ దేశంలో దుర్మార్గం జరుగుతుంది. ప్రజాస్వామ హత్య నిర్లజ్జగా విశృంఖలంగా, విచ్చలవిడిగా కొనసాగుతోన్న ప్రజాస్వామ్య హత్య . ఈ ప్రజాస్వామ్య హంతకుల యొక్క స్వైరవిహారం ఈ దేశం పునాదులకే ప్రమాదకరం. అత్యంత భయంకరమైనది. చాలా భాదాకరమైన పరిస్థితి. కనీసం మన ఊహాకు కూడా అందదు. అందుకే బాధతో మాట్లాడుతున్నాను. 8 ఏండ్ల క్రితం బీజేపీ అధికారంలోకి వచ్చి దేశాన్ని అన్ని రంగాల్లో సర్వనాశనం చేసింది. రూపాయి పడిపోయింది. నిరుద్యోగం తాండవిస్తుంది. ఆకలి రాజ్యంగా మారుతోంది ఇండియా. అంతర్జాతీయ సూచికలు మంచి చెడును చూపిస్తున్నాయి. దేశ విభజన, ప్రజలను విభజించడం.. భారత ప్రజాస్వామ్య నాడీని కలుషితం చేస్తున్నాయి. చాలా దారుణమైన పద్ధతుల్లో పోతున్నారు. నేను కూడా బాధకు గురయ్యాను అని కేసీఆర్ పేర్కొన్నారు. ఈ రోజు మునుగోడు పోలింగ్ ముగిశాకనే ప్రజల్లోకి తీసుకెళ్లాలనే ఆలోచనతో ఇంతవరకు ఎదురు చూశాను. మునుగోడులో కూడా వెకిలి ప్రయత్నాలు చేశారు. చేతుల్లో పువ్వు గుర్తులు, ఫేక్ ప్రచారాలు చేశారు. పాల్వాయి స్రవంతి తనను కలిసినట్టు, కొన్ని టీవీల పేర్లు పెట్టి ప్రచారం చేశారు. ఎలక్షన్లు వస్తాయి, పోతాయి. గెలుస్తం, ఓడిపోతం. హుజురాబాద్‌లో ఓటమి పాలయ్యాం. దుబ్బాకలో స్వల్ప మెజార్టీతో ఓడిపోయాం. నాగార్జున సాగర్, హుజుర్‌నగర్‌లో గెలిచాం. ప్రజల తీర్పును గౌరవించాలి. మేం గెలిస్తేనే లెక్క అంటే ప్రజాస్వామ్యం ఎక్కడ ఉంటది. రాజకీయాల్లో, ప్రజాజీవితంలో సంయమనం ఉండాలి. చివరికి ఎన్నికల కమిషన్ ఫెయిల్ అయిందని ఆరోపించారు. వారిని గెలిపిస్తే ఎలక్షన్ కమిషన్ మంచిది. ఓడగొడితే ఎలక్షన్ కమిషన్ ఫెయిల్ అంటరు. బీజేపీ దిగజారి ప్రవర్తిస్తోంది. ఓటమిని, గెలుపును ఏదైనా సరే స్వీకరించాలి. దుర్మార్గ పద్ధతుల్లో ముందుకు పోతున్నారు. ఉద్యమ సందర్భంలో కూడా మేం ఇంత హేయంగా ప్రవర్తించలేదు. ఇంత దౌర్భాగ్యకరంగా వెళ్లలేదు. ఈ దేశంలో, ఈ రాష్ట్రంలో ఏం జరుగుతుంది. ప్రజాస్వామ్యానికి మూలస్తంభాలుగా లెజిస్లేచర్, కార్యనిర్వాహక వ్యవస్థ, న్యాయ వ్యవస్థ, నాలుగోది ప్రెస్. వీటన్నింటిని పక్కన పెట్టేశారు. ఎవరినైనా బెదిరించగలం, ఏమైనా చేయగలం అని అనుకుంటున్నారు. ఈ ముఠాలు ఏం చేస్తున్నాయి. ఎవరు కూడా ఊహించలేదు అని కేసీఆర్ తెలిపారు.

## మునుగోడులో భారీగా డబ్బుల పంపిణీ

### ధనప్రవాహాన్ని బయటపెట్టినా పట్టించుకోని పోలీసులు

### అడుగడుగునా తనను అడ్డుకున్నారన్న బండి సంజయ్



**నల్లగొండ, నవంబర్ 3 (సమ సమాజం):** మునుగోడులో టీఆర్ఎస్ నాయకులు ఒక్కో ఓటుకు రూ.10వేల నుంచి రూ.15వేల దాకా పంచారని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ ఆరోపించారు. ధన బలంతో మునుగోడులో గెలవాలని కేసీఆర్ ప్రయత్నిస్తున్నడని మండిపడ్డారు. అతికొద్ది మీడియా సంస్థలు మాత్రమే ఈ ధన ప్రవాహం బాగోతాన్ని బయటపెట్టాయని తెలిపారు. మునుగోడులో ఆయన మీడియాతో మాట్లాడారు. టీఆర్ఎస్ ఓడిపోతుందనే డిప్రెషన్ లో కేసీఆర్ ఉన్నడు. అందుకే రోజూ పోలీసులకు ఆదేశాలు ఇస్తుండు. ఎన్నికల కమిషన్ పై ఒత్తిడి తీసుకొస్తున్నడు. బండి సంజయ్ అరెస్టు వార్తకు కవరేజీ ఇవ్వొద్దని మీడియాపై కూడా కేసీఆర్ ఒత్తిడి చేసిండని ఆరోపించారు. అందువల్లే ఆ వార్తను చాలా మీడియా సంస్థలు ప్రసారం చేయలేదని సంజయ్ కామెంట్ చేశారు. స్వయంగా ముఖ్యమంత్రే రౌడీయిజం చేయండి.. గూండాయిజం చేయండి అని టీఆర్ఎస్ నేతలకు చెబుతున్నడు. అందుకే బీజేపీ కార్యకర్తలపై, నాయకులపై వాళ్లు దాడులు చేశారు. టీఆర్ఎస్ మంత్రులు, ఎమ్మెల్యేలు స్వయంగా దగ్గరుండి ఈ దాడులు చేయించారు. అయినా మేం సహనం కోల్పోలేదు. టీఆర్ఎస్ పార్టీపై ప్రజలు నమ్మకం కోల్పోయారు. బీజేపీ వైపే జనం ఉన్నారని పేర్కొన్నారు. మునుగోడు నియోజకవర్గంలోని కొన్ని మండలాల్లో నాన్ లోకల్ టీఆర్ఎస్ నేతలు, కార్యకర్తలు ఉన్నారనే దానిపై పోలీసులకు బీజేపీ కార్యకర్తలు సమాచారమిస్తే.. వెంటనే వాళ్లు టీఆర్ఎస్ లీడర్లకు ఫోన్ చేసి సమాచారాన్ని లీక్ చేస్తున్నారు. నాన్ లోకల్స్ పారిపోయేందుకు సమయం దొరికేలా సహకరించారని సంజయ్ చెప్పారు. మా కార్యకర్తలను కాపాడు కోవడానికి హైదరాబాద్ నుంచి బయలుదేరి మునుగోడుకు వస్తే అనేక ప్రాంతాల్లో నన్ను అడ్డుకుని, చివరకు అరెస్టు చేశారు. బీజేపీ కార్యకర్తల్ని అర్ధరాత్రి పోలీసు స్టేషన్ కు ఈడ్చుకొచ్చారు. కనీస మర్యాద కూడా ఇవ్వలేదు. మీడియా, పోలీసులు, ఎన్నికల కమిషన్ సీఎం చేతిలో ఉన్నాయి. సామాన్య ప్రజలకు రక్షణ లేకుండాపోయింది. ఎన్నికల కమిషన్ మీద ప్రజలకు నమ్మకం లేకుండాపోయింది. ఎన్నికల కమిషన్ నిజాయితీగా వ్యవహరించాలని బండి సంజయ్ వ్యాఖ్యలు చేశారు

## మునుగోడు వెళుతున్న బండి సంజయ్ అరెస్ట్



(మొదటి పేజీ తరువాయి) ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్నారని మునుగోడు బీజేపీ అభ్యర్థి కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి రిటర్నింగ్ క్యాంపు అధికారి ఎదుట బైఠాయించడంతో ఉద్రిక్తత నెలకొంది.

## రాజగోపాల్ కాన్వాయ్‌పై దాడి

నల్లగొండ, **నవంబర్ 3 (సమ సమాజం):** టీఆర్ఎస్ కార్యకర్తలు మరోసారి రెచ్చిపోయారు. నల్గొండ జిల్లా మర్రిగూడెం మండలం సరంపేటలో పోలింగ్ సరళి ని పరిశీలించడానికి పోలింగ్ కేంద్రానికి వచ్చిన రాజ్ గోపాల్ రెడ్డి కన్వాయ్ పై టీఆర్ఎస్ కార్యకర్తలు రాళ్లు రువ్వారు. ఎంత సముదాయించినా వినకపోగా పోలీసులతో వాగ్వాదానికి దిగారు. ఈ నేపథ్యంలో పోలీసులకు, టీఆర్ఎస్ కార్యకర్తలకు మధ్య తోపులాట జరిగింది. వారిని అడ్డుకునే ప్రయత్నం చేసిన పోలీసులపై దాడికి యత్నించారు. ఈ పెనుగులాటలో ఓ పోలీస్ అధికారి కాలువలో పడిపోయారు. పూటుగా మద్యం సేవించి పోలింగ్ బూత్ ల దగ్గర టీఆర్ఎస్ కార్యకర్తలు గొడవలకు దిగుతున్నారని స్థానికులు చెబుతున్నారు. పోలింగ్ ప్రశాంతంగా జరుగుతున్న సమయంలో పోలింగ్ బూత్ ల దగ్గరకు వచ్చి టీఆర్ఎస్ కార్యకర్తలు ఓవరాక్షన్ చేయడంపై స్థానిక ఓటర్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఓపిక నశించిన పోలీసులు టీఆర్ఎస్ కార్యకర్తలపై లాఠీచార్జ్ చేసి వారిని అక్కడి నుంచి చెదరగొట్టారు. క్యూ లైన్ లో ఉన్న ఓటర్లను ప్రశాంతంగా ఓట్లు వేయనీయకుండా అడ్డుకుంటున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు.

## హైదరాబాద్‌లో మళ్లీ డబుల్ డెక్కర్ల చప్పుడు

(మొదటి పేజీ తరువాయి) కేటీఆర్ కు విన్నవిస్తున్నారు. దీంతో కేటీఆర్ ఇచ్చిన హామీ మేర డబుల్ డెక్కర్ బస్సులు రోడ్లపైకి రానున్నాయి. హైదరాబాద్ నగరంలోని మూడు రూట్లలో డబుల్ డెక్కర్ బస్సులు నడిపేందుకు టీఎస్‌ఆర్టీసీ తాజాగా టెండర్లు పిలవనుంది. నగర ఆర్టీసీ అధికారులు ఫ్లై ఓవర్లు లేని మూడు రూట్లలో డబుల్ డెక్కర్ బస్సులు నడిపేందుకు రూట్లను ఖరారు చేశారు.

## ప్రశాంతంగా మునుగోడు ఉప ఎన్నికల పోలింగ్

- ఉప ఎన్నికపై ఇప్పటి వరకు 28 ఫిర్యాదులు
- తనపై దుష్ప్రచారం చేయడంపై స్రవంతి ఫిర్యాదు
- మర్రిగూడలో రెండు వర్గాల మధ్య చిన్న ఘర్షణ
- ఇవిఎంల మధ్య తలెత్తిన సమస్యలు పరిష్కరించాం
- ఎన్నికల సంఘం సీఈవో వికాస్‌రాజ్ వెల్లడి



**మునుగోడు, నవంబర్ 3 (సమ సమాజం):** మునుగోడు ఉప ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా కొనసాగుతోందని సీఈవో వికాస్‌రాజ్ వెల్లడించారు. ఓటర్లు బాధ్యతగా ఓటుహక్కు వినియోగించుకోవాలని ఆయన సూచించారు. మునుగోడు ఉప ఎన్నికలపై ఇప్పటి వరకు 28 ఫిర్యాదులు వచ్చినట్లు చెప్పారు. రెండు చోట్ల నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు. తనపై దుష్ప్రచారం చేస్తున్నారన్న కాంగ్రెస్ అభ్యర్థి పాల్వాయి స్రవంతి ఫిర్యాదుపై ఈసీతో మాట్లాడినట్లు సీఈవో తెలిపారు. ఫిర్యాదు వచ్చిన సామాజిక మాధ్యమాల లింకుల ద్వారా విచారణ చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. మర్రిగూడలో రెండు వర్గాల మధ్య చిన్న ఘర్షణ జరిగినట్లు చెప్పారు. పోలీసులు వెంటనే కలగజేసుకొని ఆందోళనకారులను చెదరగొట్టారన్నారు. అదేవిధంగా మునుగోడులో మూడు చోట్ల ఈవీఎంల సమస్య తలెత్తినట్లు సీఈవో తెలిపారు. మరోచోట 20 ఓట్లు పడ్డాక ఈవీఎం మొరాయించడంతో రీప్లేస్ చేసినట్లు చెప్పారు. ఈవీఎం సమస్యలను ఎప్పటికప్పుడు సరిచేస్తున్నట్లు వివరించారు. ఉప ఎన్నిక నేపథ్యంలో నియోజకవర్గంలో స్థానికేతరులు ఉన్నారనే, పోలింగ్ కేంద్రాల వద్ద గుర్తులు ప్రదర్శిస్తున్నారనే ఫిర్యాదులపై తనిఖీలు చేసి చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. పోలీసులు ఇప్పటి వరకు 42 మంది స్థానికేతరులను గుర్తించి బయటకు పంపించినట్లు చెప్పారు. ఇకపోతే మునుగోడులో స్థానికేతరులు ఎవరూ లేరని సీఈసీ వికాస్ రాజ్ చెప్పారు. నాన్ లోకల్స్ ను గుర్తించి బయటకు పంపామని అన్నారు. మర్రిగూడలో రెండు వర్గాల మధ్య చిన్న ఘర్షణ చోటు చేసుకుందని, పోలీసులు వెంటనే వారిని చెదరగొట్టారని వికాస్ రాజ్ తెలిపారు. వీరిలో స్థానికేతరులుఉన్నట్లు ఫిర్యాదులు వస్తున్నాయని, 42 మంది స్థానికేతరులను గుర్తించి మునుగోడు నుంచి పంపించేసినట్లు చెప్పారు. ఓటు కోసం డబ్బులు ఇవ్వడం, తీసుకోవడం తప్పన్న ఆయన.. ఓటుకు డబ్బు ప్రస్తావన రావడం దురదృష్టకరమన్నారు. ఓటర్లు అందరూ బాధ్యతగా ఓటుహక్కు వినియోగించుకోవాలని సూచించారు. మూడు చోట్ల ఈవీఎంలు మార్చి పోలింగ్ కొనసాగిస్తున్నామని స్పష్టం చేశారు. ఒక దగ్గర వీవీప్యాట్ సమస్య వస్తే మార్చామన్న సీఈఓ వికాస్ రాజ్... మరొక కేంద్రంలో ఈవీఎం సమస్య తలెత్తిందని, దాన్ని కూడా సరిచేస్తున్నామని చెప్పారు. ఇప్పటి వరకు 28 ఫిర్యాదులు వచ్చాయని తెలిపారు. రెండు చోట్ల నగదు స్వాధీనం చేసుకున్నారన్న ఆయన... కాంగ్రెస్ అభ్యర్థి పాల్వాయి స్రవంతి ఫిర్యాదుపై ఈసీతో మాట్లాడామని చెప్పారు. ఫిర్యాదు వచ్చిన సోషల్ మీడియా సైట్ ల పై లింక్ ల ద్వారా విచారణ చేస్తామని తెలిపారు.

# ఢిల్లీని కమ్మేసిన దట్టమైన పొగమంచు

తిరిగి ప్రమాదకర స్థాయికి కాలుష్యం ● పంట వ్యర్థాలను తగులబెట్టడంతో పాటు వాహనాల పొగ ● పరస్పర విమర్శలతో సమస్యపై కప్పదాటులో ఆప్, బిజెపిలు



**న్యూఢిల్లీ, నవంబర్ 3 (సమ సమాజం):** దేశ రాజధాని ఢిల్లీని దట్టమైన పొగమంచు కమ్మేసింది. ఢిల్లీ సహా పరిసర ప్రాంతాల్లో కాలుష్య స్థాయిలు తిరిగి ప్రమాదకర స్థాయికి చేరుకున్నాయి. గురువారం ఉదయం ఏడు గంటల సమయంలో వాయు నాణ్యత సూచి 408కి చేరుకోగా.. 'తీవ్రత' విభాగానికి చేరుకున్నట్లు వాతావరణ శాఖ పేర్కొంది. పొరుగు రాష్ట్రాల్లో పంట వ్యర్థాలను తగుల బెట్టడంతో పాటు వాహనాల నుండి వచ్చే పొగతో ఈ పరిస్థితి ఏర్పడినట్లు తెలిపారు. మంగళవారం 424గా ఉన్న ఎక్యూఐ బుధవారం నాటికి 376కి మెరుగైంది. గతేడాది డిసెంబర్ 26న ఎక్యూఐ 459కి చేరుకుందని, ఇది అతిచెత్తరికార్డుగా పేర్కొన్నారు. విషపూరిత గాలిని పీల్చడంతో స్థానికులు అనారోగ్యం బారిన పడుతున్నారు. పిఎం 2.5 మైక్రాను లేదా అంతకంటే తక్కువగా ఉండే సూక్ష్మ ధూళికణాలు శ్వాసనాళాల గుండా ఊపిరితిత్తుల్లోకి అక్కడి నుండి రక్తప్రవాహంలోకి చేరతాయని అన్నారు. దీంతో శ్వాస, ఊపిరితిత్తుల సమస్యల బారిన పడే ప్రమాదం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ముఖ్యంగా పాఠశాలలకు వెళ్లే సమయం కావడంతో చిన్నారులు తీవ్ర అనారోగ్యం బారిన పడే ప్రమాదం ఉందని అన్నారు. వాయు నాణ్యతా ప్రమాణాలు మెరుగయ్యేంతవరకు పాఠశాలలను మూసివేయాల్సిందిగా ఆదేశించాలని చిన్నారుల హక్కుల సంఘం బుధవారం ముఖ్యమంత్రి కేజ్రీవాల్‌కి విజ్ఞప్తి చేసినట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. దీంతో కొన్ని ప్రైవేట్ పాఠశాలలకు సెలవులు ప్రకటించారు. ఆన్‌లైన్ తరగతులు నడపనున్నట్లు సమాచారం. అయితే పాఠశాలలు మూసివేత ఈ సమస్యకు పరిష్కారం కాదని.. కాలుష్య స్థాయిలను తగ్గించేందుకు దీర్ఘకాల చర్యలు చేపట్టాలని తల్లిదండ్రులు కోరుతున్నారు. మరోవైపు వాయు కాలుష్యంపై కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వంతో పాటు, ఢిల్లీ, పంజాబ్ లోని ఆమ్ ఆద్మీ ప్రభుత్వం మధ్య మాటల యుద్ధం నడుస్తోంది. దేశంలో వాయు కాలుష్యానికి కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వమే కారణమని, బీజేపీ పాలిత రాష్ట్రాల పేర్లు ప్రస్తావిస్తూ.. ప్రధానమంత్రి నరేంద్రమోదీపై ఢిల్లీ ముఖ్యమంత్రి, ఆమ్ ఆద్మీ పార్టీ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ విమర్శలు గుప్పించిన నేపథ్యంలో ఆమ్ ఆద్మీ పార్టీని, పంజాబ్ లో ఆప్ ప్రభుత్వాన్ని టార్గెట్ చేస్తూ కేంద్ర పర్యావరణ శాఖ మంత్రి భూపేంద్ర యాదవ్ గట్టిగా సమాధానం ఇచ్చారు. ఆమ్ ఆద్మీ పార్టీ దేశ రాజధానిని గ్యాస్ ఛాంబర్‌గా మార్చిందని ఆరోపించారు. దీని వెనుక పెద్ద స్కామ్ ఉందని విమర్శించారు. ఆమ్ ఆద్మీ పార్టీ పాలనలో ఉన్న పంజాబ్‌లో 2021లో వ్యవసాయ పొలాల్లో మంటలు 19శాతంపైగా పెరిగాయని, హర్యానాలో 30.6శాతం తగ్గుదల కనిపించిందని భూపేంద్ర యాదవ్ ట్విట్టర్ లో తెలిపారు. బుధవారం పంజాబ్ లో 3,634 వ్యవసాయ పొలాల్లో మంటలు సంభవించాయని తెలిపారు. ఆమ్ ఆద్మీ ప్రభుత్వం ఉన్న చోట కుంభకోణాలే ఉంటాయని ఆరోపించారు. దీనికి సంబంధించిన అనేక ఉదాహరణలను కేంద్రమంత్రి ప్రస్తావించారు. పంట అవశేషాల నిర్వహణ యంత్రాల కోసం కేంద్ర ప్రభుత్వం పంజాబ్‌కు రూ. 1,347 కోట్లు ఇచ్చిందని, రాష్ట్ర ప్రభుత్వం 1,20,000 యంత్రాలను కొనుగోలు చేసిందని, వాటిలో 11,275 యంత్రాలు మాయమయ్యాయని ఆరోపించారు. ప్రజాధనాన్ని ఆమ్ ఆద్మీ ప్రభుత్వం దుర్వినియోగం చేస్తోందని విమర్శించారు. పంట అవశేషాల నిర్వహణ యంత్రాల కోసం కేంద్ర ప్రభుత్వం పంజాబ్‌కు ఈఏడాది రూ. 280 కోట్లు ఇచ్చిందని, గత సంవత్సరం ఖర్చు చేయకుండా మిగిలిన రూ. 212 కోట్లతో కలిపి సుమారు రూ.492 కోట్లు అందుబాటులో ఉన్నా, రైతులకు అవసరమైన యంత్రాలు కొనుగోలు చేయకుండా, పంటలను రైతులు తగలబెట్టడానికి ఆమ్ ఆద్మీ ప్రభుత్వం కారణమవుతుందని విమర్శించారు. పంజాబ్ ముఖ్యమంత్రి తన సొంత ప్రాంతంలో రైతులకు ఉపశమనం కలిగించడంలో కూడా విఫలమయ్యారని, గత సంవత్సరం సంగ్రూర్‌లో పంటలను తగలబెట్టిన ఘటనలు 1,266 కాగా, ఈ సంవత్సరం అదే సమయానికి 139శాతం పెరిగి 3,025కి పెరిగాయని, ముఖ్యమంత్రి అసమర్థతే దీనికి కారణమని భూపేంద్రయాదవ్ అన్నారు. కాలుష్యం సమస్య ఉత్తరభారతదేశం మొత్తం ఉందని, ఉత్తరప్రదేశ్, హర్యానా, రాజస్థాన్, మధ్యప్రదేశ్ రాష్ట్రాల్లో వాయు కాలుష్యం సమస్య ఉందని, ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్ దాదాపు అన్ని చోట్లా సమానంగా ఉందని, ఢిల్లీ-పంజాబ్ మాత్రమే దేశమంతటా కాలుష్యాన్ని వ్యాపింపజేసిందా అంటూ ప్రధానమంత్రిని టార్గెట్ చేస్తూ అరవింద్ కేజ్రీవాల్ విమర్శలు గుప్పించారు. ఈ నేపథ్యంలో భూపేంద్రయాదవ్ ఆమ్ ఆద్మీ పార్టీ కన్వీనర్ కేజ్రీవాల్ ధీటైన జవాబిచ్చారు. కేంద్ర ప్రభుత్వం రైతులకు సహాయం చేయడం లేదని, వారిపై ఎఫ్‌ఐఆర్‌లు మాత్రమే నమోదు చేస్తోందని, వాయు కాలుష్యం విషయంలో తమ గోడు పట్టించుకోవడం లేదని, రాజకీయ ప్రయోజనాలనే బీజేపీ ప్రభుత్వం చూసుకుంటోందని ఆమ్ ఆద్మీ అధినేత విమర్శించారు.మరోవైపు బీజేపీ విమర్శలపై పంజాబ్ ముఖ్యమంత్రి భగవంత్ మాన్ కౌంటర్ ఇచ్చారు. రైతుల ఆందోళన కారణంగా వ్యవసాయ చట్టాలను వెనక్కి తీసుకోవల్సి వచ్చిందని, దీంతో రైతులపై కేంద్రప్రభుత్వం కక్ష గట్టిందని ఆరోపించారు.

# మునుగోడులో ఉదయం నుంచే ప్రలోభాలు

స్థానికేతరులు తిష్ట వేయడంపై బిజెపి ఆందోళన

పలుచోట్ల పట్టుకుని పోలీసులకు అప్పగింత

మద్యం, డబ్బులు పంపణీపై మండిపాటు

అధికార పార్టీ నేతలకు స్వేచ్ఛ ఇచ్చారన్న రాజగోపాల్



**నల్లగొండ, నవంబర్ 3 (సమ సమాజం):** మునుగోడు ఉప ఎన్నిక పోలింగ్ సందర్భంగా ఉదయం నుంచే ప్రలోభాలు, ఉద్రిక్తతలు కొనసాగాయి. విచ్చలవిడిగా డబ్బు, లిక్కర్ పంపిణీ జరుగుతోందన్న ఆరోపణలు పెద్ద ఎత్తున వినిచాయి. చాలా చోట్ల టీఆర్ఎస్ నేతలు రెడ్ హ్యాండెడ్ గా పట్టుబబడ్డారు. ఈనెల 1వ తేదీన ఎన్నిక ప్రచారం ముగియగానే నాన్ లోకల్ లీడర్స్ అందరూ మునుగోడు నియోజకవర్గం విడిచి వెళ్లాలని ఎన్నికల సంఘం ఆదేశించిన విషయం తెలిసిందే. అయితే పోలింగ్ రోజు కూడా చాలా ప్రాంతాల్లో టీఆర్ఎస్ నేతలు, కార్యకర్తలు మునుగోడు నియోజకవర్గంలోనే ఉండి.. ఓటర్లను ప్రలోభ పెడుతున్నారని బీజేపీ నేతలు ఆరోపించారు. చాలా చోట్ల టీఆర్ఎస్ నేతలు, కార్యకర్తలను రెడ్ హ్యాండెడ్ గా పట్టుకున్నారు. చండూరు, మర్రిగూడెం మండలాల్లో కొంతమంది టీఆర్ఎస్ నేతల ఇండ్లల్లో మకాం వేసిన ఆపార్టీ నాన్ లోకల్ లీడర్స్ ను బీజేపీ నేతలు పట్టుకుని ప్రశ్నించారు. మెదక్, సిరిసిల్ల, సిద్దిపేట జిల్లాలకు చెందిన అధికార పార్టీ నేతలు బీజేపీ నేతలు, కార్యకర్తలకు పట్టుబడ్డారు. ఈ క్రమంలోనే సిరిసిల్లా జిల్లా జెడ్పీ వైస్ ఛైర్మన్ సిద్ధం వేణు చండూరులో ఉన్నట్లు బీజేపీ నాయకులు గుర్తించారు. మరోవైపు.. ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల వాహనాల్లో వారి అనుచరులు డబ్బులు తరలిస్తున్నట్లు ఫిర్యాదులు, ఆరోపణలు వస్తున్నా పోలీసులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని బీజేపీ నేతలు ఆందోళన వ్యక్తం చేసారు. బీజేపీ అభ్యర్థి కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి ఇదే విషయంపై ఆరోపణలు చేశారు. నల్గొండ ఎస్పీ రెమా రాజేశ్వరితో ఫోన్ లోనూ మాట్లాడారు. అలాంటిదేమీ లేదని ఎస్పీ సమాధానమిచ్చారు. తాజాగా పట్టుబడ్డ నగదు, టీఆర్ఎస్ నాన్ లోకల్ లీడర్స్ ఇదంతా చూస్తుంటే పోలీసులు, ఎన్నికల సంఘం విఫలమైనట్లే అని బీజేపీ నేతలు అన్నారు. ఇకపోతే చండూరు మండల కేంద్రంలో ఉద్రిక్తత ఏర్పడింది. ఓ ఇంట్లో కరీంనగర్ కు చెందిన టీఆర్ఎస్ నేతలు ఉన్నారంటూ స్థానిక బీజేపీ నేతలు అక్కడికి చేరుకున్నారు. ఇంట్లో ఉన్న నాన్ లోకల్స్ ను పట్టుకునేందుకు ప్రయత్నించారు. దీంతో నాన్ లోకల్స్ గా భావిస్తున్న పలువురు టీఆర్ఎస్ కార్యకర్తలు అక్కడి నుంచి పరుగులు తీశారు. ఎన్నికల కోడ్ కు విరుద్ధంగా స్థానికేతరులు ఎందుకు ఇక్కడ ఉన్నారంటూ పోలీసులను బీజేపీ నేతలు నిలదీశారు.వరంగల్, కరీంనగర్ జిల్లాల టీఆర్ఎస్ నేతలు చండూరులో ఉంటూ స్థానిక ఓటర్లను భయభ్రాంతులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. స్థానికులైతే అక్కడే ఉండి సమాధానం చెప్పేవారని, స్థానికేతరులు కాబట్టే తమను చూడగానే పారిపోయారని బీజేపీ నేతలు వివరించారు. అయితే స్థానిక టీఆర్ఎస్ నేతలు కూడా చండూరులోని ఆ ఇంటి వద్దకు చేరుకోవడంతో ఉద్రిక్తత ఏర్పడింది. బీజేపీ, టీఆర్ఎస్ పార్టీల నాయకులను పోలీసులు అదుపు చేశారు. అలాగే చాలా చోట్ల విచ్చలవిడిగా మద్యం, డబ్బు పంపిణీ చేస్తున్నట్టు తెలుస్తోంది. నాంపల్లి మండలం టీపీగౌరారంలో టీఆర్ఎస్ ప్రలోభాలకు పాల్పడుతున్నట్టు ప్రచారం జరిగింది. ఈ క్రమంలోనే డబ్బులు పంపిణీ చేస్తోన్న ఓ వాహనాన్ని అధికారులు పట్టుకున్నట్టు తెలుస్తోంది. ఈ వాహనం ఎమ్మెల్సీ కోటిరెడ్డి అనుచరులదిగా అనుమానిస్తున్నారు. ఈ వాహనంలో నోట్లకట్టలతో పాటు టీఆర్ఎస్ పార్టీ జెండాలుండడం గమనార్హం. మద్యం, డబ్బుల పంపిణీపై సీఈవో ఆఫీసుకు ఇప్పటికే 60కి పైగా ఫిర్యాదులు వచ్చినట్టు సమాచారం. మునుగోడు వ్యాప్తంగా ఇష్టారీతిన విపరీతంగా డబ్బు పంపిణీ చేస్తున్నట్టు తెలుస్తోంది. మర్రిగూడలో టీఆర్ఎస్ నేతలు డబ్బులు పంచుతున్నారని బీజేపీ నేతలు ఆరోపిస్తున్నారు. ఈ నేపథ్యంలో పోలీసులకు, నేతలకు మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. మరికొన్ని ప్రాంతాల్లో భారీ స్థాయిలో పట్టుబడిన నగదును పోలీసులు సీజ్ చేసారు.

# సమస్యగా మారిన గాలి కాలుష్యం

ఢిల్లీలో కాలుష్యానికి చెక్ పెట్టాల్సిందే

కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ

**న్యూఢిల్లీ, నవంబర్ 3 (సమ సమాజం):** గాలి కాలుష్యం భారత్‌కు పెద్ద సమస్య అని, దాన్ని తక్షణమే నివారించాల్సిన అవసరం ఉందని కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ అన్నారు. ఢిల్లీ పొరుగు రాష్ట్రాల్లో రైతులు వరికోతల అనంతరం కొయ్యలు తగులబెడుతున్న తరుణంలో దేశ రాజధానిలో భారీగా కాలుష్యం తారాస్థాయికి చేరింది. ఈ క్రమంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. పర్యావరణం కోసం కాలుష్యం తగ్గించాల్సిన అవసరం ఉందని, ఎందుకంటే ఇది ఓ పెద్ద సమస్య అన్నారు. క్లీన్ ఫ్యూయల్స్-2022పై అంతర్జాతీయ సదస్సులో ప్రసంగించిన ఆయన.. ఢిల్లీలో గాలి నాణ్యత తగ్గుతుండడంపై ఆందోళన వ్యక్తం చేశారు.వరి పొట్టును బయో విటమిన్‌గా మార్చాల్సిన అవసరాన్ని నొక్కి చెప్పారు. దేశంలో అనేక విజయవంతమైన ప్రాజెక్టులున్నాయని, వరిగడ్డితో బయో-సీఎన్‌జీ, బయో ఎల్ఎన్‌జీని తయారు చేస్తున్నట్లు పేర్కొన్నారు. రవాణా రంగాన్ని డీ కార్బనైజ్ చేసి ఆర్థిక వ్యవస్థ, పర్యావరణాన్ని నిలకడగా మార్చాల్సిన అవసరం ఉందన్నారు. ఇథనాల్, మిథనాల్, బయో సీఎన్‌జీ, బయో ఎల్ఎన్‌జీ, బయో డీజిల్, గ్రీన్ హైడ్రోజన్, విద్యుత్ వంటి స్వచ్ఛమైన.. గ్రీన్ జీవ ఇంధనాల వినియోగాన్ని ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. స్వచ్ఛమైన ఇంధనం బహుళ ప్రయోజనాలను కలిగి ఉంటుందన్న ఆయన.. చమురు దిగుమతి బిల్లులను తగ్గిస్తుంది, ఇంధన భద్రత, వాయు కాలుష్యం తగ్గుదలను నిర్ధారిస్తుందని చెప్పారు.

## 26 లక్షల 85వేల వాట్సాప్ అకౌంట్స్ సీజ్

ఐటి నిబంధనలకు విరుద్ధంగా ఉండడమే కారణం

ఇక ట్విట్టర్‌లోనూ నిబంధనల అమలుకు చర్యలు

**న్యూఢిల్లీ, నవంబర్ 3 (సమ సమాజం):** వాట్సాప్‌ను మెటా కొనుగోలు చేసిన తర్వాత, వాట్సాప్ కూడా యూజర్ల ప్రైవసీ, పాలసీ విషయానికి ఎక్కువ ప్రాధాన్యం ఇస్తుంది. దీనికి కారణం వాట్సాప్ ను సోషల్ మీడియా మాధ్యమంగా చేసుకొని కొందరు తప్పుడు, నకిలీ, ఇతరులకు హాని కలిగించే సమాచారాన్ని ప్రచారం చేస్తున్నారు. దీనిపై స్పందించిన భారత ఐటీ మంత్రిత్వ శాఖ 'ఐటీ రూల్స్ 2021'ని తీసుకొచ్చింది. ఐటీ రూల్స్‌లో భాగంగా.. ఏ యూజర్ అయినా వైలేషన్ ప్రేరేపించేవి, ఫేక్ న్యూస్, హరాజ్మెంట్ చేస్తుంటే, వాళ్ల వాట్సాప్ అకౌంట్ ని బ్యాన్ చేసి, చట్ట పరంగా చర్యలు తీసుకుంటారు. అందులో భాగంగా వాట్సాప్ యూజర్ల నుంచి కంప్లైట్స్, రిపోర్ట్ లు తీసుకుంటుంది. ఎవరైతే వాట్సాప్ అకౌంట్ ని తప్పుగా వాడుతున్నారో, వాళ్ల అకౌంట్‌ని బ్యాన్ చేస్తుంది. దీని ప్రకారం సెప్టెంబర్ నెల మొత్తంలో వాట్సాప్ 26 లక్షల 85 వేల భారతీయ వాట్సాప్ అకౌంట్స్ బ్యాన్ చేసింది. అందులో ఫేక్ ఐడెంటిటీ అకౌంట్స్ కూడా ఉన్నాయి. ఇదిలావుంటే ట్విటర్‌లో బ్లూటిక్‌లకు ఇక నుంచి చార్జ్ చేస్తామని సంస్థ బాస్ ఎలన్ మస్క్ చేసిన ట్వీట్‌కు నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్‌సీపీఐ) స్పందించింది. నెలవారీ చెల్లింపుల కోసం డెవలప్ చేసిన తమ యూపీఐ ఆటోపే ఆఫర్‌ను వాడుకోవాలని సూచించింది. సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ దిలీప్ అస్బే ..మస్క్ చేసిన ట్వీట్‌కు సమాధానమిస్తూ, యూపీఐ రికరింగ్ పేమెంట్స్ ఆఫర్‌కు ఇప్పటికే 70 లక్షల మంది కస్టమర్లు ఉన్నారని చెప్పారు.

## నెత్తురోడిన రోడ్లు
## వేర్వేరు ప్రమాదాల్లో 8మంది మృత్యువాత

వికారాబాద్ జిల్లాలో ఆటోను ఢీకొన్న లారీ

ప్రమాదంలో నలుగురు మృతి

సంగారెడ్డి జిల్లాలో కారును ఢీకొన్న లారీ

కారులో ఉన్న నలుగురు జీడిమెట్ల వాసులు మృతి

మహబూబ్‌నగర్ జిల్లాలో బోల్తాపడ్డ ప్రైవేట్ బస్సు

**హైదరాబాద్, నవంబర్ 3 (సమ సమాజం):** మరోమారు రోడ్లు నెత్తురోడాయి. వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో మొత్తం 8మంది ఉర్మరణం చెందారు. పలువురు గాయపడ్డారు. వికారాబాద్ జిల్లాలో ఘోర ప్రమాదం చోటు చేసుకున్నది. ఘటనలో నలుగురు దుర్మరణం చెందారు. ధరూర్ మండలం కేరెల్లి బాచారం వంతెన వద్ద ఆటోను ఓ లారీ ఢీకొట్టింది. సంఘటనా స్థలంలో ముగ్గురు ప్రాణాలు కోల్పోగా.. ఏడుగురు గాయపడ్డారు. క్షతగాత్రులను వికారాబాద్ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఇక్కడ మరో వ్యక్తి మృతి ప్రాణాలు కోల్పోయాడు. పలువురి పరిస్థితి విషమంగా ఉండగా వారిని మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌కు తరలించారు. మృతుల్లో ఆటో డ్రైవర్ జమిల్, రవి, కిషన్, సోనీబాయిగా గుర్తించారు. బాధితులంతా పెద్దేముల్ మండలం మదనంతాపూర్ వాసులుగా పోలీసులు తెలిపారు. కూలీ పనుల కోసం వికారాబాద్ వెళు తుండగా ప్రమాదం జరిగింది. ఆసుపత్రి వద్ద మృతుల కుటుంబాల రోదనలు మిన్నంటాయి. ప్రమాదానికి కారణమైన లారీ డ్రైవర్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.సంగారెడ్డి జిల్లాలో గురువారం ఉదయం ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఆందోల్ మండలం కన్సాన్‌పల్లి వద్ద నాందేడ్-అకొలా జాతీయ రహదారిపై ఆర్టీసీ బస్సు, కారు ఢీకొట్టుకున్నాయి. ఈ ఘటనలో నలుగురు వ్యక్తులు అక్కడికక్కడే దుర్మరణం పాలయ్యారు. పొగమంచు కారణంగా రోడ్డు కనిపించక పోవడమే ప్రమాదానికి కారణమని భావిస్తున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని సహాయక చర్యలు చేపట్టారు. చిన్నారి కాంక్షతో పాటు డ్రైవర్ దిలిప్, వినోద, సుప్రసిత ప్రమాదం లో మృతి చెందగా.. వీరిని హైదరాబాద్‌లోని జీడిమెట్ల వాసులుగా గుర్తించారు. బస్ రాంగ్‌రూట్‌లో రావడం.. పొగమంచుకారణంగా ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించకపోవడంతో బస్సు కారు ఢీకొన్నట్లు తెలుస్తున్నది. ఇకపోతే మహబూబ్‌నగర్ రూరల్ మండలం దివిటిపల్లి సమీపంలోని జాతీయ రహదారిపై తెల్లవారు జామున ఓ ప్రైవేటు ట్రావెల్ ప్రమాదవశాత్తు బోల్తాపడింది. ఈ ఘటనలో బస్సులో ప్రయాణిస్తున్న 40 మంది ప్రయాణికులకు గాయాలయ్యాయి. 14 మందిని చికిత్స నిమిత్తం జిల్లా ఆసుపత్రికి తరలించారు. ప్రమాదం జరిగిన సమయంలో బస్‌లో 54 మంది ప్రయాణికులు ఉన్నారు. పులివెందుల నుంచి హైదరాబాద్‌కు వెళ్తున్న సమయంలో ఘటన చోటు చేసుకున్నది. బస్సు బోల్తాపడడానికి కారణాలు తెలియరాలేదు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని, విచారణ జరుపుతు న్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## షర్మిల స్టేట్‌మెంట్‌పై స్పందించాలి: ఎంపి రఘురామ

**న్యూఢిల్లీ, నవంబర్ 3 (సమ సమాజం):** మాజీ మంత్రి వివేకా కేసులో వైఎస్సార్టీపీ అధినేత్రి వైఎస్ షర్మిల ఇచ్చిన స్టేట్‌మెంట్‌పై ఎంపీ రఘురామ కృష్ణం రాజు స్పందించారు. గురువారం మీడియాతో మాట్లాడుతూ... షర్మిల స్టేట్‌మెంట్‌పై జగన్ ఏం సమాధానం చెబుతారని ప్రశ్నించారు. షర్మిలచెప్పిందే.. విజయలక్ష్మి కూడా చెబుతారేమో అని అన్నారు. షర్మిల్ స్టేట్‌మెంట్ బయటకు రాకుండా అయ్యన్నను అరెస్ట్ చేశారని తెలిపారు. రుషికొండపై అవసరమైతే మరోసారి సుప్రీంకోర్టు ను ఆశ్రయిస్తానని స్పష్టం చేశారు. సివిల్ కేసుకు.. సీఐడీకి సంబంధమేంటి?.. అయ్యన్నది అక్రమ అరెస్ట్ అని అన్నారు. సీఐడీ చీఫ్ ఏపీలో ఉండడానికి అనర్హుడని ఎంపీ రఘురామకృష్ణరాజు విమర్శించారు.

# ఓటు హక్కు వినియోగించుకున్న అభ్యర్థులు

ఇడికుడలో ఓటేసిన పాల్వాయి స్రవంతి ◆ లింగవారిగూడెంలో ఓటేసిన కూసుకుంట్ల





**నల్లగొండ, నవంబర్ 3 (సమ సమాజం):** మునుగోడులో ఉప ఎన్నిక ఓటింగ్ కొనసాగుతోంది. నల్గొండ జిల్లా చండూరు మండలం ఇడికుడ గ్రామంలో కాంగ్రెస్ అభ్యర్థి పాల్వాయి స్రవంతి ఓటు హక్కు వినియోగించు కున్నారు. తర్వాత చండూరులో పోలింగ్ కేంద్రాన్ని ఆమె పరిశీలిచారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరిగిన ఈసీకి ఫిర్యాదు చేస్తానన్నారు. ప్రస్తుతానికి ఓటింగ్ ప్రశాంతంగా జరుగుతుందని తెలిపారు. అలాగే నారాయణపురం మండలం బీఎస్పీ అభ్యర్థి అందోజు శంకరాచారి తన ఓటు హక్కు వినియోగించుకున్నారు. కుటుంబ సభ్యులతో కలిసి ఆయన ఓటు వేశారు. నారాయణపురం మండలం లింగవారిగూడెంలో టిఆ÷-ఎస్ అభ్యర్థి కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు చాలా కీలకమన్నారు. ప్రజలంతా ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు.కొంత మంది కావాలనే డ్రామాలు చేస్తున్నారని ఫైర్ అయ్యారు. బీజేపీ నేతలు బైపోల్ ను రద్దు చేసుకుందుకు కుట్ర చేస్తున్నారని ఆరోపించారు.

# మత విద్వేషాలు రెచచగొడుతున్న బిజెపి

రాహుల్ పాదయాత్రలో పాల్గొన్న జీవన్ రెడ్డి

**హైదరాబాద్, నవంబర్ 3 (సమ సమాజం):** జాతీయ స్థాయిలో మత విద్వేషాలను రెచ్చగొట్టే విధంగా బీజేపీ రాజకీయాలు చేస్తోందని ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి ఆరోపించారు. బీజేపీ చేస్తున్న మత విద్వేషాలను.. నిర్మూలించేందుకు రాహుల్ గాంధీ భారత్ జోడో యాత్ర చేస్తున్నారని ఆయన చెప్పారు. రాష్ట్రంలో నిరుపేదలకు ఉపాధి, ఉద్యోగ కల్పన లేదని విమర్శించారు. ఉపాధి హామీ పథకం కూడా నిర్వీర్యం చేసే విధంగా నిధుల కోత విధిస్తోందని కేంద్రం?పై మండిపడ్డారు. అదాని అంబానీ లాంటి వ్యాపారస్తులకు ఔఖం కింద లక్షల కోట్లు రుణ మాఫీ చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్రం తీరుతో పాటు.. రాష్ట్ర ప్రభుత్వం?పైనా జీవన్ రెడ్డి విమర్శలు గుప్పించారు. రాష్ట్రంలో ఎక్కడైనా 24 గంటల కరెంట్ ఇస్తున్నట్టు చూపిస్తే.. తాను కేసీఆర్‌కు పాలాభిషేకం చేస్తానన్నారు. కాంగ్రెస్ హయాంతో మిల్లర్ల కోతలు లేవని.. ఇప్పుడు సబ్సిడీలు కూడా ఎత్తేసి రైతుబంధుతో రైతులను మోసం చేస్తున్నారని ప్రభుత్వంపై మండిపడ్డారు. ధరణి పోర్టల్ ద్వారా రైతులను మరింత ఇబ్బందుల్లోకి నెట్టేశారని చెప్పారు. మునుగోడులో మద్యం ఎరులై పారుతోందని ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి పేర్కొన్నారు.





# చలన చిత్రం

## హిట్-2 లో పోలీస్ పాత్రలో అడవిశేషు




టాలీవుడ్ హీరో అడివి శేష్ ప్రస్తుతం 'హిట్ 2' చిత్రంలో నటిస్తున్నాడు. ఈ సినిమా డిసెంబర్ 2వ తేదీన థియేటర్లలో విడుదల కానుంది. ఈ నేపథ్యంలో మేకర్స్ ఈ సినిమా నుండి తాజాగా టీజర్ ను వదిలారు. టీజర్ లో పోలీస్ ఆఫీసర్ గా ఒక డిఫరెంట్ బాడీ లాంగ్వేజ్ లో అడివి శేష్ కనిపిస్తున్నాడు. ఒక యువతి మర్డర్ కేసును పోలీస్ ఆఫీసర్ గా అడివి శేష్ ఎలా ఛేదించాడు అనేదే కథ. సరిగ్గా ఆ పాయింటు పైనే టీజర్ ను కట్ చేశారు. ఈ టీజర్ సినిమాపై మరింత ఆసక్తినిరేపుతోంది. గతంలో విష్వక్సేన్ హీరోగా 'హిట్' సినిమాను నిర్మించిన నాని, ఆ సిరీస్ లో భాగంగా 'హిట్ 2'ను ప్రేక్షకుల ముందుకు తీసుకుని వస్తున్నాడు. జాన్ స్టీవర్ట్ ఈ సినిమాకి బ్యాక్ గ్రౌండ్ స్కోర్ అందించాడు. ఈ సినిమాకు శైలేశ్ కొలను దర్శకత్వం వహించాడు. అడివి శేష్ కు జోడీగా మీనాక్షి చౌదరి నటించగా,రావు రమేశ్ ఒక కీలకమైన పాత్రను పోషించాడు.

## కొత్త దర్శకుడు అరుణాచలంతో నాగశౌర్య ప్రయాణం




హీరోగా ర్తింపుని తెచ్చుకోవడానికి నాగశౌర్యకు పెద్ద ప్రయోగామే చేయాల్సి వచ్చింది. హీరోగా నిలబడాలంటే తనిని తానే నిలబెట్టుకోవాలని భావించిన నాగశౌర్య సొంతం గా బ్యానర్ని ప్రారంభించి 11 సినిమాల తరువాత 12న మూవీతో సూపర్ హిట్ ని దక్కించుకోవాల్సి వచ్చింది. అదే 'ఛలో'. స్వీయ నిర్మాణంలో రిస్క్ చేసి నాగశౌర్య చేసిన ఈ మూవీ అతని కెరీర్ లో వసూళ్ల పరంగా హిట్ టాక్ పరంగా ప్రత్యేకంగా నిలిచింది. హీరోగా కూడా మంచి గుర్తింపుని తెచ్చిపెట్టింది. అయితే ఆ హిట్ని నిలబెట్టుకోవడం కోసం నాగశౌర్య వేసిన అడుగులు అతన్ని ఫ్లాప్ ల వైపు పరుగులు తీసేలా చేశాయి. 'ఛలో' మూవీతో రొమాంటిక్ హిట్ ని దక్కించుకుని హీరోగా నిలబడ్డానని భావించాడు. కానీ అది ఎంతో సేపు నిలబడలేదు. ఇటీవల విడుదలయిన 'కృష్ణ వ్రింద విహారి' పాజిటివ్ టాక్ నే సొంతం చేసుకున్నా నాగశౌర్య ఆశించిన విజయాన్ని మాత్రం అందించలేకపోయింది. సొంత బ్యానర్ లో చేసిన ఈ మూవీపై భారీ అంచనాలు పెట్టుకున్నా అప్పటికే నాని నటించిన 'అంటే సుందరానికి' సినిమా పోలీకలు వుండటంతో ఆశించిన ఫలితాన్ని రాబట్టలేకపోయింది. ప్రస్తుతం నాగశౌర్య ఫలానా అబ్బాయి - ఫలానా అమ్మాయి నారీ నారీ నడుమ మురారీ పోలీస్ వారి హెచ్చరిక వంటి మూడు విభిన్నమైన సినిమాల్లో నటిస్తున్నాడు. ప్రస్తుతం ఈ మూడు ప్రాజెక్ట్ లు షూటింగ్ దశలో వున్నాయి. ఇదిలా వుంటే తాజాగా నాగశౌర్య కొత్త దర్శకుడు ఎస్.ఎస్. అరుణాచలంతో కొత్త ప్రాజెక్ట్ కు గ్రీన్ సిగ్నల్ ఇచ్చేశాడు. ఇది నాగశౌర్య నటిస్తున్న 24వ మూవీ. గురువారం ఈ సినిమాని చిత్ర బృందం అధికారికంగా ప్రకటించింది. వైష్ణవి ఫిలింస్ బ్యానర్ పై చింతలపూడి విజయ్ కుమార్ చింతలపూడి డా. అశోక్ కుమార్ చింతలపూడి నిర్మిస్తున్నారు. వినోదం ఫ్యామిలీ ఎమోషన్స్ నేపథ్యంలో సాగే యాక్షన్ ఎంటర్ టైనర్ గా ఈ మూవీని తెరకెక్కించబోతున్నారు. గత కొంత కాలంగా ఈలాంటి స్క్రిప్ట్ కోసమే నాగశౌర్య ఎదురుచూస్తున్నారట. తనకు ఇది కరెక్ట్ స్క్రిప్ట్ అని తెలుస్తోంది. ఈ మూవీని అత్యంత భారీ స్థాయిలో తెరపైకి తీసుకురానున్నారట. సినిమాలో నాగశౌర్య సరికొత్త మేకోవర్ లో కనిపించనున్నాడని ఇందు కోసం కసరత్తులు చేస్తున్నాడట. త్వరలోనే గ్రాండ్ గా ప్రారంభం కానున్న ఈ మూవీలోని కీలక పాత్రల్లో పేరున్న నటీనటులు నటిస్తారని క్రేజీ టెక్నీషియన్స్ వర్క్ చేయనున్నారని మేకర్స్ చెబుతున్నారు. ఇందులో నటించే నటీనటులు సాంకేతిక నిపుణుల వివరాల్ని మేకర్స్ ప్రకటించనున్నారట. మరి ఈ మూవీతో పరిచయం అవుతున్న అరుణాచలం అయినా నాగశౌర్యని మళ్లీ సక్సెస్ బాట పట్టించేనా అన్నది వేచి చూడాల్సిందే.



## వారసుడుగా వస్తున్న విజయ్



తమిళ సూపర్ స్టార్ విజయ్ హీరోగా నటిస్తున్న లేటెస్ట్ మూవీ 'వారిసు' తెలుగులో 'వారసుడు'. ఈ సినిమాను టాలీవుడ్ డైరెక్టర్ వంశీ పైడిపల్లి రూపొందిస్తున్నాడు. తాజాగా ఈ మూవీ నుంచి లేటెస్ట్ అప్ డేట్ వచ్చింది. ఈ సినిమాలోని ఫస్ట్ సాంగ్ రానుంది. దీనికి సంబంధించిన ప్రోమోను ఇవాళ సాయంత్రం మేకర్స్ రిలీజ్ చేయనున్నారు. ఈ మేరకు శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ ట్విట్టర్ ద్వారా స్పెషల్ పోస్టర్ విడుదల చేసింది. ఇప్పటికే విడుదలైన ఈ చిత్ర పోస్టర్స్ సినిమాపై ఆసక్తినిరేపుతున్నాయి. కాగా, విజయ్ కి ఇది 66వ మూవీ. ఈ సినిమాను శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్, పీవీపీ బ్యానర్లపై నిర్మాతలు దిల్ రాజు, శిరీష్, పరమ్ వి పొట్లూరి, పెరల్ వి పొట్లూరి సంయుక్తంగా నిర్మిస్తున్నారు. వచ్చే ఏడాది సంక్రాంతి సందర్భంగా ఈ సినిమా థియేటర్లలో విడుదల కాబోతోంది. థమన్ ఈ సినిమాకు సంగీతం అందిస్తున్నారు. ఇందులో విజయ్ సరసన రష్మిక మందన హీరోయిన్ గా నటిస్తోంది.

## డిఫరెంట్ లవ్‌స్టోరీ ఊర్వశివో, రాక్షసివో'

నేడు థియేటర్లలో విడుదల

గ్లామరస్ రోల్స్‌తో ఇంప్రెస్ చేసే అను ఇమ్మాన్యుయేల్.. 'ఊర్వశివో, రాక్షసివో' సినిమాతో ప్రేక్షకుల ముందుకొస్తోంది. అల్లు శిరీష్ హీరోగా, రాకేష్‌శశి ఈ చిత్రాన్ని రూపొందించాడు. అల్లు అరవింద్ సమర్పణలో ధీరజ్ మొగిలినేని, ఎం.విజయ్ నిర్మించారు. నేడు సినిమా రిలీజ్ అవుతున్న సందర్భంగా అను ఇలా ముచ్చటించింది. సింధు అనే సాఫ్ట్‌వేర్ అమ్మాయిగా నటించా. కెరీర్‌లో ఉన్నత స్థాయికి ఎదగాలనే తపనతో ఉండే క్యారెక్టర్. ఆమెకి ప్రేమ కావాలి. కానీ ప్రేమే జీవితం అనుకోదు. అలాంటి అమ్మాయికి శ్రీకుమార్ అనే సింపుల్ కుర్రాడు పరిచయం అవుతాడు. డిఫరెంట్ మైండ్ సెట్స్‌తో ఉండే సింధు, శ్రీ మధ్య నడిచే ప్రేమకథ హైలైట్‌గా నిలుస్తుంది. యూత్‌ని బాగా అట్రాక్ట్ చేస్తుంది. ఈ కథను ఎంపిక చేసుకోవడానికి అరవింద్ గారు ముఖ్యకారణం. 'ఇలాంటి హీరోయిన్ ఓరియెంటెడ్ క్యారెక్టర్ చేస్తే బాగుంటుంది. ట్రై చేయ్' అని చెప్పడంతో ఓకే అన్నాను. పైగా గీతా ఆర్ట్స్‌లో సినిమా అంటే ఫ్యామిలీ అంతా కలిసి ఎంజాయ్ చేసేలా ఉంటుంది. నా పాత్ర చాలా కొత్తగా ఉంటుంది. షూటింగ్ మొదలవకముందు.. శిరీష్, నేను ఒకరి గురించి ఒకరం తెలుసుకున్నాం. అందుకే స్క్రీన్‌పై మా ఇద్దరి మధ్య లవ్ సీన్స్, కెమిస్ట్రీ, ఎమోషన్స్ బాగా ఆకట్టుకుంటాయి. రాకేశ్ శశి డెడికేటింగ్ పర్సన్. అతనికి సినిమా తప్ప వేరే లోకం తెలీదు. ఇక నేను నటించిన సినిమాలు ఆడలేదేమో కానీ నటిగా ఫెయిల్ అనే మాట ఎక్కడా వినిపించలేదు. అనూ కళ్లతో అభినయించగలదు అనే మార్క్ సంపాదించుకున్నా. కొన్ని సినిమాల రిజల్ట్‌తో నన్ను నేను మార్చుకున్నా. రెగ్యులర్ సినిమాలకు దూరంగా ఉంటున్నా. ఆ పాత్రకు నేను సూట్ అవుతాను అనుకుంటేనే ఓకే చేస్తున్నా. లేదంటే ఇంట్లో కూర్చుంటా. ఏదో వచ్చాం... చేశాం.. వెళ్లాం అనుకునే పద్ధతిలో లేను. మంచి కథ ఎంచుకోవడం, పాత్రకు న్యాయం చేయడం వరకే నా చేతిలో ఉంది. సక్సెస్ నా చేతిలో లేదఇ వెల్లడంచింది.




Edited, Printed, Published & owned by **GOSUKONDA PRUDHVIRAJU**, Published From, H.No. 6-17, VI:PALIVELA, MANDAL:MUNUGODE, DIST: NALGONDA - 508244, TELANGANA,
Printed at **Panidhar PUBLICATIONS**. H.NO: 6-17, VI:PALIVELA, MANDAL:MUNUGODE, DIST: NALGONDA - 508244, Editor: **GOSUKONDA PRUDHVIRAJU**,
RNI.TELTEL/2016/ 73311, Cell:8897334003 Email: samasamajamdaily@gmail.com, Website: www.samasamajam.in